క్లుప్తంగా

హౌసింగ్ సిబ్బందితో సమీక్ష



రికార్డులను పరిశీలిస్తున్న జహీర్ అహ్మద్

మనుబోలు: ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం అందజేస్తున్న అదనపు నగదును లబ్ధిదారులు వినియోగించుకోవాలని హౌసింగ్ డీఈ జహీర్ అహ్మద్ పేర్కొన్నారు. హౌసింగ్ కార్యాలయాన్ని సోమవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం గృహ నిర్మాణాలపై హౌసింగ్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పునఃప్రారంభించేందుకు గానూ ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేలను అదనంగా ప్రభుత్వం చెల్లిస్తోందని వివరించారు. మండలంలో 300 మంది లబ్ధిదారులకు ఈ మేరకు అందజేశామని, సాధ్యమైనంత త్వరగా నిర్మించుకోవాలని సూచించారు. హౌసింగ్ సిబ్బంది శరత్, శ్రీనివాసులు, కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు అర్జీల సమర్పణ

పొదలకూరు: ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో భాగంగా తహసీల్దార్ శివకృష్ణయ్యకు వినతిపత్రాలను రైతులు సోమవారం సమర్పించారు. భూ హద్దులు, పాస్‌పుస్తకాలు తదితరాలపై అర్జీలను అందజేశారు. వీటిని వెంటనే పరిష్కరించేలా చూడాలని వీఆర్వోలకు సూచించారు. కాగా సాంకేతిక కారణాలతో ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక వీడియో కాన్ఫరెన్స్ పనిచేయలేదు.

ఎన్టీఆర్ వైద్యసేవలు బంద్

• ఇబ్బందుల్లో రోగులు

నెల్లూరు(అర్బన్): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎన్టీఆర్ వైద్యసేవలకు ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు నాలుగు నెలల నుంచి పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందనలేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీస్ హాస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నుంచి జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలను ఆస్పత్రుల యాజమాన్యాలు బంద్ చేశాయి. దీంతో ఆయా ఆస్పత్రుల్లో ఆరోగ్యమిత్రలు లేక ఎన్టీఆర్ వైద్యసేవా రిజిస్ట్రేషన్ రూములు ఖాళీగా దర్శనమిచ్చాయి.

అత్యవసర సేవలకు మినహాయింపు

అయితే రోగులకు అవసరమయ్యే అత్యవసర సేవలను సమ్మె నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు మినహాయించాయి. ప్రమాదాలు, తీవ్ర అస్వస్థత వచ్చిన రోగులను మాత్రమే ఆస్పత్రుల్లో చేర్చుకున్నారు. మిగతా వారు ఉసూరు మంటూ వెనుతిరిగారు.

ఆక్రమణలను తొలగించుకోండి

నెల్లూరు(బారకాసు) : నగరంలో ప్రధాన రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలు, ఇతర నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే వాటిని తొలగిస్తామని కమిషనర్ సూర్యతేజ సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 28వ డివిజన్ జర్నలిస్ట్ కాలనీ, కేశవులునగర్, వేదాయపాళెం కూడలి, గాంధీనగర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కమిషనర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎన్టీ రోడ్డు, పొదలకూరు రోడ్డు, మినీబైపాస్‌రోడ్డులోని కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కుదింపునకు గురై, ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు అంతరాయంగా ఉన్న విషయాన్ని గుర్తించామని తెలిపారు. ఈ క్రమంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా రోడ్డు మార్జిన్‌ను పూర్తిగా వదిలేయాలని సూచించారు. జర్నలిస్టు కాలనీలోని ప్రజాపార్కులో అవసరమైన జిమ్ పరికరాలను త్వరలో అందజేస్తామని తెలియజేశారు. స్థానిక ప్రజాప్రతినిధి చెక్కసాయి సునీల్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, వెటర్నరీ వైద్యుడు డాక్టర్ మదన్‌మోహన్, హార్టీకల్చర్ ఏడీ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



పొదలకూరు: సీతారాముల కల్యాణం



పొదలకూరు: హాజరైన భక్తులు

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం

పొదలకూరు: శ్రీరామనవమిని పురస్కరించుకొని స్థానిక శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా ఆదివారం రాత్రి నిర్వహించారు. ఉభయకర్తలుగా సురేష్, మంజుల దంపతులు వ్యవహరించారు. భక్తులకు ముత్యాల తలంబ్రాలను అందజేశారు. అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

మనుబోలు: మండలంలోని కొండూరుసత్రంలో సీతారాముల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. స్వామివారికి మహాగణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, విష్ణు సహస్రనామార్చన, రామనామ హోమాన్ని అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. తదుపరి సీతారాములుకు అభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. కల్యాణాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.



మనుబోలు: కొండూరుసత్రంలో..

ముత్తుకూరు: కృష్ణపట్నంలోని కోదండరామస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఈపూరులోని చెన్నకేశవస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం సోమవారం తెల్లవారుజాము వరకు సాగింది.



ముత్తుకూరు: కృష్ణపట్నంలో హోమం



ముత్తుకూరు: ఈపూరులో చెన్నకేశవస్వామి గ్రామోత్సవం

వైభవంగా రాములోరి గ్రామోత్సవం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: శేషవాహనంపై సీతారాములు



బుచ్చిరెడ్డిపాళెంలో సూర్యప్రభ వాహనంపై కోదండరాముడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని కాగులపాడు గ్రామంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి సీతారాములను శేషవాహనంపై ఊరేగించారు. ఉభయకర్తలుగా విజయ, సునీల్‌కుమార్, మానస వ్యవహరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వినోద్‌కుమార్, ప్రతాప్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై..

కొడవలూరు (బుచ్చిరెడ్డిపాళెం) : బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హంసవాహనంపై కోదండరాముడు విహరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

గిరిజనులకు ప్రత్యేక ఆధార్ కేంద్రం

ముత్తుకూరు: కేవలం కూలీ పనులపైనే ఆధారపడి జీవిస్తూ ప్రభుత్వ కార్యాలయాలంటేనే తెలియని గిరిజన కుటుంబాలకు ఆధార్ కార్డులను అందజేసే కార్యక్రమాన్ని మండలంలో సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా బ్రహ్మదేవి సచివాలయంలో పొట్టెంపాడు, మల్లూరు, దువ్వూరువారిపాళెం, తాళ్లపూడి గ్రామాల గిరిజన కుటుంబాలకు ఆధార్ కార్డులను అందజేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఒక్క రోజే 70 మందికి అందజేశారు. ఐటీడీఏ ఆపరేటర్లు పెంచలతేజ, పెంచలయ్య, చిట్టిబాబు పాల్గొన్నారు.



ముత్తుకూరులో..

సద్వినియోగం చేసుకోవాలి

కొడవలూరు : గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎ.వెంకట సుబ్బారావు కోరారు. మండలంలోని కమ్మపాళెంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అక్కడికి వచ్చిన గిరిజనులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల కోసం విధిగా ఆధార్ కలిగి ఉండాలని చెప్పారు. ఇప్పటికీ తోటి వారిలో ఎవరికైనా లేనట్లు తెలిస్తే ప్రోత్సహించి ఆధార్ కేంద్రానికి పంపాలన్నారు. సచివాలయ సిబ్బంది కూడా ప్రత్యేక చొరవ చూపి ఆధార్ లేని గిరిజనులను గుర్తించి పొందేలా కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఐటీడీఏ అధికారి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి మనోహర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొడవలూరు: ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బారావు

ధాన్యానికి ధర లేక దిగాలు

• కొనుగోళ్ల నిలిపివేతతో అగచాట్లు

పొదలకూరు: రబీ సీజన్లో ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం నిలిపేసింది. దీంతో పండించిన ధాన్యాన్ని విక్రయించుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో రబీ సీజన్లో అధికారికంగా 14 వేలు, అనధికారికంగా మరో రెండు వేల ఎకరాల్లో వరినాట్లు వేశారు. ముందుగా నాట్లు వేసిన రైతులు.. దళారులు, నేరుగా రైస్‌మిల్లర్లకు నష్టామో లాభమో అమ్ముకున్నారు. మార్చి చివర్లో, ఏప్రిల్ మొదటి వారంలో నూర్పిడి పనులు పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని అమ్ముకోలేకపోతున్నారు. మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 12 పీపీసీల ద్వారా సుమారు 300 టన్నుల ధాన్యాన్నే కొనుగోలు చేశారు. చాలా మంది రైతులు దళారుల ద్వారానే విక్రయించి ఇప్పటి వరకు వారి నుంచి నగదును కూడా తీసుకోలేదు. ఆలస్యంగా కోతలు చేపట్టిన రైతులు ఇప్పుడు ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోలేక ఆరబెట్టుకొని కూలీలను ఏర్పాటు చేసి ఇంటికే చేర్చుకుంటున్నారు. నిల్వ ఉన్న ధాన్యాన్ని మరో రెండు నెలల తర్వాత విక్రయిస్తామని చెప్తున్నారు. పుట్టి ధాన్యాన్ని రూ.17 వేలకు అడుగుతున్నారని, ప్రాధేయపడితే మరో రూ.500 ఇస్తున్నారని రైతులు తెలిపారు. కొన్ని గ్రామాల్లో ధాన్యాన్ని మిల్లర్లు, దళారులు అడగడంలేదు. నగదు అవసరం ఉన్న రైతులు దళారులను సంప్రదిస్తే, ప్రస్తుతం మార్కెట్ లేదని, ధాన్యాన్ని తాము కొనుగోలు చేయలేమని బదులిస్తున్నారు. దీంతో విసిగిపోయిన రైతులు ధాన్యాన్ని కల్లాల పక్కనే ఆరబెట్టుకొని ఇంటికి చేర్చుకుంటున్నారు. దిగుబడి తగ్గి ఖర్చులు పెరిగి పండించిన ధాన్యాన్ని అమ్ముకోలేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.



ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

కొడవలూరులో చలివేంద్రం ఏర్పాటు

కొడవలూరు: కొడవలూరు పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ఎంపీడీఓ ఎ.వెంకట సుబ్బారావు ప్రారంభించి మాట్లాడారు. వేసవి తాపాన్ని తీర్చేలా అవసరమైన చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ముక్తార్‌బాషా, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.ప్రతాప్, సర్పంచ్ ఎస్.కామాక్షి, పంచాయతీ కార్యదర్శి మురళి, మహిళా పోలీసు వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.



బీజేపీ మండల కమిటీ ఎన్నిక



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : భారతీయ జనతా పార్టీ మండల నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. బీజేపీ బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండలాధ్యక్షుడు సిద్దన మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా రోశిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, హరినారాయణ, వెంకటేశ్వరరెడ్డి, రమణయ్య, సుధాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా కృష్ణారెడ్డి, మస్తానయ్య నియమితులయ్యారు. అనంతరం కార్యదర్శులు, కోశాధికారి, వివిధ బీజేపీ మోర్చా కమిటీలను ఎన్నిక చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘురామయ్య, పెంచలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట : కాజ్‌వే నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాళెం కాజ్‌వే నిర్మాణ పనులను ఆమె సోమవారం తనిఖీ చేశారు. నిర్మాణ పనుల పురోగతి గురించి అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో కాజ్‌వే నిర్మాణ పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తొలుత కుడితిపాళెంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గొలుసు దోపిడీ

నెల్లూరు(క్రైమ్) : బైక్‌పై వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు తెంపుకెళ్లిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం మార్కండేయ కాలనీకి చెందిన పద్మావతి ఈనెల ఐదో తేదీన తన సోదరునితో కలిసి నెల్లూరు నుంచి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. ప్రశాంతినగర్ స్విమ్మింగ్‌పూల్ దాటి బైక్ తిప్పుతుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని మూడుసవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. నిందితుడి మొహం గుర్తుపట్టకుండా హెల్మెట్ ధరించి ఉన్నాడు. ఈమేరకు బాధిత మహిళ ఈనెల 6న నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీఏ కింద సమాచారమివ్వని హెచ్‌ఎం

• చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి

కొడవలూరు : నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం ఓబులేసు సమాచార హక్కు చట్టం కింద పాఠశాల సమాచారం అడిగితే ఇవ్వలేదని గ్రామానికి చెందిన కొండా శ్రీనివాసులురెడ్డి కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 24న సమాచారం కోసం కోరగా, 34 రోజులు గడిచినా ఎలాంటి సమాధానం ఇవ్వలేదన్నారు. హైస్కూల్ ప్లస్‌లో అనేక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలున్న నేపథ్యంలో రికార్డులను స్వాధీనం చేసుకొని డీఈఓ ద్వారా లేక ఉన్నతాధికారుల ద్వారా వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. అదేవిధంగా సమాచార హక్కు చట్టాన్ని అపహాస్యం చేసిన హెచ్‌ఎం ఓబులేసుపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ విచారణకు ఆదేశిస్తామని హామీ ఇచ్చారు.



కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్న కొండా శ్రీనివాసులురెడ్డి

దోపిడీ దొంగల బీభత్సం



మధుసూదన్ నివాసంలో చోరీ జరిగిన తీరుపై ఆరాతీస్తున్న పోలీసులు



దయాకర్‌రెడ్డి ఇంట్లో చిందర వందరగా పడేసిన బీరువాలోని వస్తువులు

• మూడు ఇళ్లల్లో చోరీ
• రెండు సవర్ల బంగారు, రూ.45 వేల నగదు అపహరణ

కోవూరు : మండల కేంద్రమైన కోవూరులో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. మూడు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి రెండు సవర్ల బంగారు, రూ.45 వేల నగదును అపహరించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పడుగుపాడు ధాత్రి గ్రీన్ హోమ్‌లో నివాసముంటున్న మధుసూదన్ కుటుంబసభ్యులతో గత నెల 13న బెంగళూరుకు వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం పనిమనిషి చూసి ఇంట్లో చోరీ జరిగినట్లు యజమానికి సమాచారం అందించింది. ఆయన వచ్చి చూడగా రెండు సవర్ల బంగారు వస్తువులు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ట్రైనీ డీఎస్పీ శివప్రియ, సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్‌లు క్లూస్ టీమ్‌తో వచ్చి పరిశీలించారు. అంతలోనే అదే ప్రాంతంలో దయాకర్‌రెడ్డి ఇంట్లో తలుపులు పగులగొట్టి బీరువాను తెరచి వెళ్లినట్లు తెలిసింది. అక్కడ రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. అదేవిధంగా కోవురులోని దేవిరెడ్డి సురేష్‌రెడ్డి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో రూ.25 వేల నగదు అపహరణకు గురైనట్లు తెలిసింది. మూడు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు .

భూ సమస్యలకు సత్వర పరిష్కారం



మనుబోలు: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ సుబ్బయ్య పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఎంపీడీఓ జలజాక్షి, ఏపీఎం వనజాక్షి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన ముంబై రోడ్డు



మృతిచెందిన సమద్



తీవ్రంగా గాయపడిన షాన్‌వాజ్



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

• రెండు ప్రమాదాల్లో ఇద్దరి మృతి
• మరో ముగ్గురికి తీవ్రగాయాలు



మృతుడు ముజాహిద్(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం రూరల్/ కొడవలూరు (బుచ్చిరెడ్డిపాళెం) : బుచ్చిరెడ్డిపాళెం మీదుగా వెళ్లే ముంబై రహదారి సోమవారం రెండు వేర్వేరు ప్రమాదాలతో రక్తమోడింది. ఈ ఘటనల్లో ఇద్దరు మరణించగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారి వివరాలు ఇలా ఉన్నాయి. బుచ్చిరెడ్డిపాళెం నుంచి సంగం వైపు వెళ్తున్న కారు సబ్‌స్టేషన్ వద్ద ఓ హోటల్ దగ్గర రోడ్డు పక్కన నిలిపి ఉంది. అదే సమయంలో ఇద్దరు వ్యక్తులు బుచ్చిరెడ్డిపాళెం నుంచి సంగం మండలం దువ్వూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆగిఉన్న కారును వెనుక నుంచి వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో దువ్వూరుకు చెందిన సమద్ (50) అక్కడికక్కడే మృతిచెందాడు. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన షాన్‌వాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని బుచ్చి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



కాగులపాడు వద్ద గాయపడిన మహిళ

దర్గాకు వెళ్లి వస్తూ..

ఇందుకూరుపేట మండలం కొరుటూరుకు చెందిన ఓ కుటుంబం ఏఎస్‌పేట దర్గాకు ఆటోలో వెళ్లి తిరిగి వస్తూ కాగులపాడు వద్ద ట్రాక్టర్ ఢీకొని ప్రమాదానికి గురయ్యారు. అందులో ముజాహిద్ (29) అనే యువకుడితో పాటు మరో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారికి తీవ్ర గాయాలు కావడంతో నెల్లూరుకు తరలించారు. నెల్లూరు నుంచి మెరుగైన వైద్యం కోసం ముజాహిద్‌ను చెన్నైకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు వారి కుటుంబీకులు తెలిపారు. మిగిలిన వారు తీవ్ర గాయాలతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు తెలియజేశారు.



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్